యువత సమాజసేవను బాధ్యతగా భావించాలి


వైద్యశిబిరంలో బండి రమేష్, నాయకులు

కూకట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నేటితరం యువత జీవితంలో రాణించడంతో పాటు సమాజసేవను కూడా బాధ్యతగా భావించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. బాలాజీనగర్‌లో కాంగ్రెస్ నాయకులు శివచౌదరి, బచ్చుమల్లి, బాబ్జి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యువత ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి రావాలని పేర్కొన్నారు. నెక్ట్‌జన్ ఆసుపత్రి సహకారంతో బీపీ, షుగర్, కీళ్ల సమస్యలు, సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మణ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాధు ప్రతాప్‌రెడ్డి, రేష్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో 5కే రన్


రన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి: శారీరక రుగ్మతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూకట్‌పల్లిలోని ఆకార్ ఆశా ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించినట్లు ఆసుపత్రి నిర్వాహకురాలు అరుణ ఆదివారం తెలిపారు. కూకట్‌పల్లి జాతీయ రహదారిలోని పిల్లర్ నెంబర్ ఏ 782 సమీపంలోని ఆస్పత్రి నుంచి కేపీహెచ్‌బీకాలనీ, జేఎన్‌టీయూ మీదుగా కూకట్‌పల్లి వరకూ ఈ రన్ కొనసాగింది.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


బంగారు, వెండి చీపుర్లతో రథం ముందు శుభ్రం చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ గ్రామంలోని పురాతనమైన సీతారామస్వామి దేవస్థానంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా సీతారామస్వామి ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై యాత్రను ప్రారంభించారు. యాత్ర సాగే సమయంలో బంగారు, వెండి చీపుర్లతో రథం ముందు శుభ్రపరిచి దారి చూపించారు. ఈ రథయాత్రలో వంగా శ్రీనివాస్, వరగాని వాసు, ఫణి, రామచ్రందనాయక్, వర్మ రాజు, రామానాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న మదన్‌గౌడ్, టీచర్‌లు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాపూర్‌నగర్: సూరారం డివిజన్ షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2006-07 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు నిర్వహించారు. పూర్వ హెచ్‌ఎం లలితకుమార్, ఉపాధ్యాయులు కమలాకర్, త్రిమూర్తులు, లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురికి పదవులు

చందానగర్: శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా రేవల్లె రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ రాజేష్‌కు నియామకపత్రాన్ని ఆదివారం అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ జహంగీర్ నియమితులయ్యారు.

శేరిలింగంపల్లిలో రాజకీయ వేడి

- మారనున్న రాజకీయ పరిణామాలు
- కేటీఆర్‌ను కలిసిన నియోజకవర్గ ఉద్యమకారులు, నాయకులు

మియాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, పార్టీ కోసం కష్టపడిన ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం కలిశారు. వీరి సమావేశంలో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే పార్టీ మారడంతో బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అయిందని చెప్పుకుంటున్న తరుణంలో ఆ పార్టీకి ప్రాణప్రతిష్ఠ చేసి పార్టీని నిలవెట్టిన ఉద్యకారులు, నాయకులు పెద్దఎత్తున రావడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. మొదటి నుంచీ పార్టీకి అండగా ఉన్నవారిని పట్టించుకోకుండా కొత్తగా వారిని అందలం ఎక్కించడంతోనే ఈ పరిస్థితి వచ్చినట్లు


నాయకులు, ఉద్యమకారులతో మాట్లాడుతున్న కేటీఆర్

ఆరు కేటీఆర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తామంతా పార్టీకి అండగా ఉంటామని, నియోజకవర్గంలో పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తామని కేటీఆర్‌కు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో పార్టీని బాధ్యతగా ముందుకు తీసుకవెళ్లే సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించాలని వారు కోరినట్లు తెలుస్తుంది.

బాధ్యతలు అప్పగిస్తే పూర్వవైభవం తెస్తా: సాయిబాబా

నియోజకవర్గంలో మంచి గుర్తింపుతో పాటు పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆదివారం కేటీఆర్‌ను వ్యక్తిగతంగా కలిశారు. ఉద్యమకారులు, కార్యకర్తలు పార్టీ పట్ల ప్రేమ, సానుభూతితో ఉన్నవారిని కాపాడుకోవడంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాని ఇందుకోసం తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని కేటీఆర్‌కు తన అభ్యర్థనను తెలియజేసినట్లు సమాచారం. ఈ విషయంపై కేటీఆర్ వారం పదిరోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నియోజకవర్గంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలపై వాడీవేడీగా చర్చ జరుగుతోంది.

హెచ్‌ఎంటీ ఉద్యోగుల సేవలు మరువలేనివి

దుండిగల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంటీ ఉద్యోగుల సేవలు మరువలేనివని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి పోచంపల్లిలోని వేదిక గార్డెన్స్‌లో హెచ్‌ఎంటీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌజింగ్ బిల్డింగ్ సొసైటీ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సొసైటీ డైరెక్టర్లకు సన్మానం ఆదివారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ ప్రగతిలో హెచ్‌ఎంటీ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఉద్యోగులు దేశంలోని ఏ రంగానికైనా ప్రత్యేక యంత్రాలను తయారు చేసే సామర్థ్యం వీరికి ఉందన్నారు.

బంగ్లాదేశ్ నుంచి నగరానికి తీసుకొచ్చి.. బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి..

- పెళ్లి చేసుకుని భార్యతో దందా
- తప్పించుకొని పోలీసులను ఆశ్రయించిన యువతి

హైదరాబాద్‌సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ యువతితో బలవంతంగా వ్యభిచారం చేస్తు న్న ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బంగ్లాదేశ్ యువతిని పోలీసులు హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. పూణెకు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులు బంగ్లాదేశ్‌లో ఉండి అక్కడి యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత సముద్ర మార్గం గుండా రహస్యంగా ఇండియాకు తీసుకొచ్చి పుణెలో కాపురం పెట్టాడు. ఆమె పేరుతో ఆధార్‌కార్డు సైతం సృష్టించాడు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల్లోనే అతనికి అప్పటికే పెళ్లయిన విషయం ఆ యువతికి తెలిసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఆమెను వదిలించుకోవాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడ కిస్మత్‌పూర్‌లో తన తమ్ముడు షాకీర్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. తర్వాత షాకీర్ ఆ యువతిని భయపెట్టి లొంగదీసుకుని, ఢిల్లీకి చెందిన జాకీర్‌కు అమ్మేశాడు. జాకీర్ పుణెకు చెందిన మరో మహిళతో హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ యువతిని కూడా కొద్దిరోజులు నిర్బంధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆన్‌లైన్‌లో విటులతో బేరం కుదుర్చుకొని ఆటోలో తీసుకెళ్లి కస్టమర్స్ వద్దకు, హోటళ్లకు తిప్పేవాడు. వచ్చిన డబ్బులు జాకీర్, పుణెకు చెందిన మహిళ తీసుకునేవారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ యువతికి, పుణె మహిళకు గొడవ జరిగిందని తెలుసుకున్న జాకీర్ యువతిని తీవ్రంగా కొట్టాడు. దీంతో బంగ్లాదేశ్ యువతి వారి చెర నుంచి తప్పించుకొని స్థానికుల సహాయంతో పోలీసులను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు జాకీర్, పుణె మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి వెనుక ఇంకా ఏదైనా ముఠా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు సేవ చేసేందుకు ముందుండాలి: ఈటల

పేట్‌బషీరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పార్టీలు వేరైనా కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచిన వారెవరైనా ప్రజలకు సేవ చేసేందుకు ముందుండాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని ఆదిత్య హోమ్స్ క్లబ్ కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవానికి ఆయన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి, బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి హాజరై ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విల్లాలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం విల్లాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఎంపీ నిధులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ఖర్చు చేస్తామని, దరఖాస్తులు అందిస్తేనే పనులు చేసే కల్చర్ ఉండదని, ప్రజల కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పార్టీల, నాయకుల మధ్య రాజకీయ సంబంధాలు గొప్పగా ఉండాలి. కానీ దురదృష్టం ఏమిటంటే, ఒక పార్టీ ఎమ్మెల్యే. ఇంకో పార్టీ ఎమ్మెల్యేతో మాట్లాడడమే నేరంగా ఉందన్నారు. రాజకీయ నాయకుడు సమాజానికి దిక్సూచిగా పని చేసేలా ఉండాలని, ఏ సమస్యకైనా పరిష్కారమార్గాన్ని చూపేది రాజకీయ నాయకులే కావాలన్నారు. మల్కాజిగిరిలో తాను గెలువలేదని, ప్రజలే గెలిచారని, గెలిచిందీ వాళ్లేనని అన్నారు. రాబోయే తరానికి మనుగడ సాధించాలంటే మొక్కలే నాటాలని, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.


మొక్కలు నాటుతున్న ఈటల రాజేందర్

మొక్కలు నాటి వాటిని బాధ్యతాయుతంగా పెంచినప్పుడే మానవాళికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్యా విల్లాస్ చైర్మన్ వి.భాస్కర్‌రెడ్డి, వెంకట్ రమణ, జగన్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీఎల్ ప్రసాద్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే గాంధీ రాజీనామా చేయాలి'

గచ్చిబౌలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నట్లు ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పార్టీలు మారుతున్న ఎమ్మెల్యే గాంధీకి ధైర్యం ఉంటే తన పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఆదివారం కొండాపూర్ మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అరెకపూడి గాంధీ టీడీపీ నుంచి గెలిచిన బీఆర్ఎస్‌లో చేరారని, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరడం ప్రజలను మోసం చేయడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన విమర్శించారు. గాంధీ వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీలు మారుతున్నారని తెలిపారు. గతంలో చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే అధికార పార్టీలో చేరారని ఆరోపించారు. రాఘవేందర్‌రావు, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నవతారెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయదుర్గం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన ఇంగోలే వృషికేష్ భగవాన్‌రావ్(29) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి వట్టినాగులపల్లి గ్రామంలో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా శనివారం మధ్యాహ్నం పార్సిల్ డెలివరీ చేసేందుకు తన బైక్ పైన విప్రో సర్కిల్ నుంచి నానక్‌రామ్‌గూడ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ భగవాన్‌రావు ఢీ కొట్టింది. దీంతో అతడు రోడుపై కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం 6.30 గంటలకు మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కామేశ్వరి(60) ఆదివారం ఉదయం బొటానికల్ గార్డెన్ పాలపిట్ట పార్కు వద్ద రోడ్డు దాటుతుండగా మజీద్‌బండ నుంచి కొండాపూర్ వైపు వేగంగా దూసుకొచ్చిన ద్విచక్రవాహనదారుడు ఆమెను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కామేశ్వరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మృతురాలి కుమారుడు ధర్మారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్లాపూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అల్లాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నెం.1007లోని ఖాళీ ప్రదేశంలో ఓ చెట్టుకు వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుకున్న పోలీస్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వయస్సు 45-50 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు లేత ఎరుపు, ఆకపచ్చ రంగు షర్టు, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని, బూట్లు, నీలంరంగు సాక్స్ ఆ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ అధికారి సయ్యద్ ఉస్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.